క్లుప్తంగా

స్పీకర్ అభినందనలు



మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రానికి చెందిన కరాటే సిస్టర్స్ అకాడమీ వ్యవస్థాపకుడు జహీద్ వికారాబాద్‌లో జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చేతుల మీదుగా మంగళవారం అవార్డు అందుకున్నాడు.

ఎమ్మెల్సీ సత్యవతికి సన్మానం

డోర్నకల్: శాసన మండలిలో బీఆర్ఎస్ పార్టీ విప్‌గా నియమితులైన మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్‌ను మంగళవారం హైదరాబాద్‌లో బీఆర్ఎస్ నాయకులు నాయకులు మన్యు పాట్ని, బోడ శ్రీను ఆమెను ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

గూడూరు: మండల విద్యాశాఖలో ఉన్న పలు పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని పీఆర్‌టీయూ తెలంగాణ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి పులి దేవేందర్ ముదిరాజ్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. విద్యార్థి ఉపాధ్యాయ నిష్పత్తిని సర్దుబాటు చేయాలన్నారు. సామాజిక కుల కుటుంబ సర్వేలో పాల్గొన్న ఉపాధ్యాయుల రెమ్యునరేషన్ విడుదల చేసేలా ప్రయత్నం చేయాలని, ఆపార్ పూర్తి చేయడానికి సీఆర్‌పీలు సహకరించేలా చేయాలన్నారు. కార్యక్రమంలో బాలుర హెచ్ఎం సదాశివ పాల్గొన్నారు.

బాలికలు ఉన్నతంగా ఎదగాలి

మహబూబాబాద్ అర్బన్: బాలికలు చదువుతోపాటు అన్నిరంగాల్లో రాణించి ఉన్నతంగా ఎదగాలని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల హెచ్ఎం డి.కోటేశ్వరి అన్నారు. మానుకోట మున్సిపల్ పరిధిలోని ముత్యాలమ్మగూడెం గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలల్లో మంగళవారం 'వాయిస్ గర్ల్స్' అనే శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ జయసుధ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనూష భరద్వాజ్, ప్రాజెక్ట్ ఆఫీసర్ సుచిత్ర, ఫీల్డ్ కోఆర్డినేటర్లు గ్రీష్మ, సోనం, కచవా, కౌన్సిలర్ వనజ, హర్షిత, అక్షిత పాల్గొన్నారు.

అరుణ హోమం

మహబూబాబాద్ రూరల్: పట్టణంలోని శ్రీ ఉమాచంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానంలో నూతన అఖండ దీపం మంగళవారం ప్రారంభమైంది. ఆలయ ప్రధాన అర్చకులు అన్నవఝుల యుగంధర్ శర్మ ఆధ్వర్యంలో మాఘ మాస, మహా శివరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. రథ సప్తమి సందర్భంగా సూర్య భగవానుడికి ప్రీతికరమైన అరుణ హోమం, మహా పూర్ణాహుతి పూజను ఘనంగా జరిపి భక్తులకు ఆశీర్వచనాలు అందజేశారు.

ప్రజలు సుభిక్షంగా ఉండాలి

పెద్దవంగర: గ్రామ దేవతల ఓడిలో ప్రజలు సుభిక్షంగా ఉండాలని పాలకుర్తి నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరాజేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని రేఖ్యాతండాలో దుర్గమాత వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె హాజరై ప్రత్యేక పూజలు చేపట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్, నాయకులు మురళి, సైదులు, గోపాల్, కర్ణాకర్ పాల్గొన్నారు.

అభినందనీయం



చిన్నగూడూరు: మండలంలోని గంగమ్మ తల్లి ఆలయం నిర్మాణం కోసం దాతల సహకారం అభినందనీయమని యాదవ సంఘం నాయకులు చిత్తారి వెంకన్న, కొమ్ము మల్లయ్య పేర్కొన్నారు. గాడిపెల్లి ఉప్పలయ్య రూ.10వేలు, దేశగాని రమేష్ రూ.5వేలు విరాళంగా యాదవ సంఘం కమిటీ నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వెంకన్న, సురేష్, ఉపేందర్, కృష్ణ పాల్గొన్నారు.

గడ్డివాముల దగ్ధం

గూడూరు: ప్రమాదవశాత్తు రెండు గడ్డివాములు దగ్ధమైన సంఘటన మండలంలోని దామరవంచ శివారు లక్ష్మితండాలో మంగళవారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యాహ్నం ఇళ్ల మధ్య ఉన్న గడ్డివాములు ప్రమాదవశాత్తు నిప్పంటుకొని మంటలు వ్యాపించాయి. దీంతో పొగ కమ్ముడంతో సమీపంలో పంటచేలల్లో ఉన్నవారు పరుగున వచ్చి మంటలు ఆర్పేప్రయత్నం చేశారు. కానీ అప్పటికే మంటల ఉధృతితో గడ్డివాములు కాలి బూడిద అయినట్లు బాధిత రైతులు నూనావత్ మోతీలాల్, ధారావత్ గోపిరియా తెలిపారు. సుమారు రూ. 20వేలకు పైగా నష్టం జరిగినట్లు ఆవేదన వ్యక్తం చేశారు.

రోడ్డుకు కోత.. ప్రజలకు వెత

- ప్రమాదకరంగా రహదారులు
- ఇబ్బంది పడుతున్న రైతులు, వాహనదారులు





కోతకు గురి కావడంతో ప్రమాదకరంగా మారిన రోడ్డు

కురవి: మండలంలోని సూదనపల్లి-జయ్యారం వెళ్లే మార్గంలో ప్రధాన రహదారి ప్రమాదకరంగా ఉంది. రోడ్డుపై వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. గత ఏడాది ఆగస్టులో వచ్చిన భారీ వర్షానికి సూదనపల్లి గ్రామశివారులో జయ్యారం వెళ్లే మార్గంలో రోడ్డు కోతకు గురైంది. రోడ్డు సగం కోతకు గురికావడంతో ప్రజలు, రైతులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత శాఖ అధికారుల రోడ్డును మరమ్మతులు సైతం చేయకపోవడం నిర్లక్ష్యాన్ని రుజువు చేస్తుంది. కోతకు గురైన రోడ్డు పక్క నుంచి రైతులు తమ పంట చేలకు వెళ్లేందుకు నానా అవస్థలు పడుతున్నారు. రాత్రి వేళల్లో కోతకు గురై గుంతగా మారిన దాంట్లో పడే ప్రమాదం ఉంది. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జయ్యారం, మంగోరిగూడెం, తదితర గ్రామాలకు చెందిన ప్రజలు ఈ రహదారిపై ప్రయాణం చేస్తున్నారు. రాత్రి వేళల్లో వాహనాలతో వెళ్తే రోడ్డు పక్కన గుంతలో పడే అవకాశం ఉంది. ఇప్పటికైన సంబంధిత శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మరమ్మత్తులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించాలని డిమాండ్ చేస్తున్నారు.

వెంటనే మరమ్మతులు చేయించాలి



గత ఏడాది కురిసిన భారీ వర్షానికి, వరదలకు రోడ్డుకు కోతకు గురైంది. కోత గురైన ప్రాంతంలో నడవాలన్నా, వాహనాలను తీసుకెళ్లాలన్నా భయం వేస్తోంది. ఆర్అండ్‌బీ అధికారులు, ప్రజాప్రతినిధులు మరమ్మతులు చేసి ప్రజల బాధలు తీర్చాలి. ప్రమాదం జరగకముందే సమస్యను పరిష్కరించాలి.

– గంగాధరి సురేష్, సూదనపల్లి, రైతు

పెండింగ్ బకాయిలు చెల్లించాలి



డీఎంకు వినతిపత్రం ఇస్తున్న రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగులు

నెహ్రూసెంటర్: ఏడు సంవత్సరాల నుంచి ఆర్టీసీ ఉద్యోగులకు చెల్లించాల్సిన పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు కోరారు. ఈమేరకు రిటైర్డ్ ఉద్యోగులు ఆర్టీసీ డిపో మేనేజర్ ఎం.శివప్రసాద్‌కు మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా రిటైర్డ్ ఉద్యోగులు మాట్లాడుతూ.. టీఎల్ఈ, గ్రాజీటీ, డిఫరెన్స్, ఆర్‌పీఎస్ 201 ఏరియల్స్, సీసీఎల్ నుంచి రావాల్సిన బకాయిలు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. మహాలక్ష్మీ పథకం ద్వారా ఆర్టీసీ అభివృద్ధి చెందుతున్నందున బకాయిలకు విడుదల చేసి రిటైర్డ్ ఉద్యోగులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగులు ముత్తయ్య, పట్టాబి లక్ష్మయ్య, బాలనాగు నాగేశ్వర్‌రావు, మాచర్ల సుధాకర్, ఎండి.రంజాన్, జి.హరికుమార్, సోమేశ్వర్ రావు, జగన్, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

కురవి: టాటా ఏస్ వాహనం డివైడర్‌ను ఢీకొట్టిన సంఘటనలో ఒక వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన కురవి మండలం కొత్తూరు(జీ) శివారు తాట్య తండా గ్రామ పరిధిలోని భద్రాచలం ప్రధాన రహదారిపై మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గార్ల మండలం పెద్ద కిష్టాపురం గ్రామానికి చెందిన చందావత్ ఆకాశ్ అనే వ్యక్తి టాటా ఏస్ వాహనం తీసుకుని మహబూబాబాద్‌కు వస్తున్నాడు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న కల్వర్టును ఢీకొట్టడంతో డ్రైవింగ్ చేస్తున్న ఆకాశ్ అనే వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ ఈఎంటీ నవీన్, పైలట్ అశోక్‌లు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని మహబూబాబాద్ జనరల్ ఆస్పత్రికి తరలించారు.

ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలి



కురవి: మాట్లాడుతున్న డీఈ విజయ్

కురవి: రైతులు, ప్రజలు ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలని మహబూబాబాద్ విద్యుత్ శాఖ డీఈ విజయ్ సూచించారు. మంగళవారం మండల కేంద్రం శివారు లింగ్యాతండాలో విద్యుత్ వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు, వినియోగదారులు, తమ సర్వీస్ వైర్లను నాణ్యమైనవి ఉపయోగించి ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రైతులు మోటార్లకు ఎర్తింగ్ వైరు బిగించుకోవాలన్నారు. ఆటోమెటిక్ స్టార్టర్లను తీసివేసి ట్రాన్స్‌ఫార్మర్లపై భారం తగ్గించాలని సూచించారు. మోటార్లకు కెపాసిటర్లను బిగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈ శారద, సబ్ ఇంజనీర్ శ్రీనివాసు, సిబ్బంది సంజీవ, జంపిరావు, వెంకటేష్ పాల్గొన్నారు.

మోటార్లకు కెపాసిటర్లు బిగించుకోవాలి

గార్ల: విద్యుత్ మోటార్లకు కెపాసిటర్లను బిగించుకోవడం ద్వారా మోటార్లు కాలిపోకుండా నివారించడంతోపాటు, విద్యుత్ ఆదా అవుతుందని విద్యుత్ డీఈ విజయ్ రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని పోచారం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ ప్రమాదాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన రైతులకు అవగాహన కల్పించారు. ఈ సదస్సులో ఏఈ కందిమళ్ల మహేంద్రబాబు, సబ్ ఇంజనీర్ మధు, లైన్ ఇన్‌స్పెక్టర్ నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వైర్లు తెగి నిలిచిన రాకపోకలు

డోర్నకల్: డోర్నకల్, బలపాల రోడ్డు మార్గంలో మంగళవారం కర్రల లోడుతో వెళ్తున్న లారీకి విద్యుత్ వైర్లు తగడతంలో రాకపోకలకు అంతరాయం కలిగింది. లింగాల నుంచి కాగజ్‌నగర్‌కు కర్రల లోడుతో వెళ్తున్న లారీకి మున్నేరు బ్రిడ్జి సమీపంలో పైన 11కేవీ వైర్లు తగిలి తెగడంతోపాటు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభం విరిగింది. ఎలాంటి ప్రమాదం జరగకపోయినా రోడ్డుపై రాకపోకలు నిలిచిపోయాయి. ఎస్సై వంశీధర్, విద్యుత్ శాఖ ఏఈ కిరణ్ ఘటనా స్థలానికి చేరుకుని విద్యుత్ వైర్లను తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు.

ఎన్నికలకు సన్నద్ధం కావాలి



గార్ల: నాయకులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

గార్ల: స్థానిక సంస్థల ఎన్నికలపై మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ పార్టీల రాజకీయ నాయకులకు ఎంపీడీఓ అవగాహన కల్పించారు. గ్రామ పంచాయతీల్లో ఇప్పటి వరకు ఉన్న ఓట్ల తుది జాబితా వివరాలు, వార్డుల వారీగా ఓట్ల వివరాలను నాయకులకు ఆమె వెల్లడించారు. పంచాయతీ ఎన్నికలకు త్వరలో ఎన్నికల నోటిఫికేషన్ రానున్నందున ఎన్నికలకు రాజకీయ పార్టీల నాయకులు సన్నద్ధం కావాలని సూచించారు. ఈ సమావేశంలో నాయకులు దనియాకుల రామారావు, గంగావత్ లక్ష్మణ్‌నాయక్, కందునూరి శ్రీనివాస్, భూక్యా నాగేశ్వరరావు, కట్టిబోయిన శ్రీనివాస్, అలువాల సత్యవతి పాల్గొన్నారు.

కురవిలో..

కురవి: మండల పరిషత్ కార్యాలయంలో త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల విషయమై మంగళవారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఎంపీడీఓ వీరబాబు సమావేశం నిర్వహించారు. ఎన్నికల ఏర్పాట్లు, తదితర అంశాలను చర్చించారు. కార్యక్రమంలో నాయకులు తురక రమేష్, బుర్ర సమ్మయ్య, కట్ల కృష్ణయ్య, బాలగాని శ్రీనివాస్, చిన్నం గణేష్ పాల్గొన్నారు.

డోర్నకల్‌లో..

డోర్నకల్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణపై సమావేశం నిర్వహించారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో గతంలో ప్రచురించిన జాబితాకు సవరణలో నూతన ఓటర్ల చేర్పుపై చర్చించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ శ్రీనివాసనాయక్, ఎంపీఓ మున్వర్‌అలీ, తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం



పెద్దవంగర: ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు



కొత్తగూడ: మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

తొర్రూరు: కేంద్ర ప్రభుత్వం ప్రజామోద బడ్జెట్ ప్రవేశపెట్టి సామాన్యుల హృదయాలను గెలుచుకుందని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ పూసాల శ్రీమాన్ అన్నారు. కేంద్ర బడ్జెట్ ప్రవేశ పెట్టిన బిల్లును హర్షిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం డివిజన్ కేంద్రంలో ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. పేద, మధ్య తరగతి ప్రజలు, రైతులు, చిరువ్యాపారుల, యువ పారిశ్రామికవేత్తలకు అనుకూలమైన బడ్జెట్ అన్నారు. కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా తెలంగాణలోని సుమారు 50లక్షల మంది రైతులకు రూ.5లక్షల వరకు బ్యాంకుల ద్వారా రుణం లభించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ అర్బన్ అధ్యక్షుడు పైండ్ల రాజేష్, నాయకులు కొలుపు శంకర్, మంగళంపల్లి యాకన్న, అలిసేరి రవిబాబు, కస్తూరి పులేందర్, భరత్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడ: మధ్య తరగతి ప్రజలకు ట్యాక్స్ లేకుండా బడ్జెట్ రూపొందించినందుకు గాను మండలకేంద్రంలో బీజేపీ నాయకులు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు యాదగిరి మురళీ, నాయకులు తోటకూరి మధు, ప్రవీణ్, నవీన్ నాయక్, రూప్లి, యాకయ్య పాల్గొన్నారు.

పెద్దవంగర: బడ్జెట్‌లో నిరుపేద, మధ్యతరగతి ప్రజలకు అత్యధిక నిధులు కేటాయించడం హర్షనీయమని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రంగు రాములు గౌడ్ అన్నారు. మంగళవారం మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సుధాకర్, రచ్చ కుమార్, రహీమ్, ఆనంద్, వెంకటనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

స్వీయ జాగ్రత్తలతో క్యాన్సర్ దూరం



మాట్లాడుతున్న సుగుణాకర్ రాజు

తొర్రూరు: స్వీయ జాగ్రత్తలతో క్యాన్సర్ బారిన పడకుండా ఉండవచ్చని ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పగిడిపాటి సుగుణాకర్ రాజు అన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా మంగళవారం డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి జ్వలిత, వైద్యులు మీరాజ్, ప్రియాంక, మానస, ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మరిపెడ రూరల్: మరిపెడ మండలం చిల్లంచర్ల జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ప్రపంచ క్యాన్సర్ డే సందర్భంగా తొర్రూరు టీచర్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు రూ.3వేల విలువగల పరీక్ష సామగ్రి, స్నాక్స్ అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం కవిత, క్లబ్ అధ్యక్షుడు చింతల సురేష్, పూర్వ అధ్యక్షుడు యాకయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైన్‌షాపులో అంగన్‌వాడీ గుడ్లు

- క్యాంటీన్ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్
- కేంద్రంలో అన్ని సీజ్ చేసిన సీడీపీఓ శిరీష



క్యాంటీన్‌లో అంగన్‌వాడీ కోడిగుడ్లను సీజ్ చేస్తున్న సీడీపీఓ శిరీష

మహబూబాబాద్: కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని వేంకటేశ్వర వైన్ షాపు పర్మనెంట్ రూంలో సీడీపీఓ శిరీష మంగళవారం తనిఖీ చేయగా అంగన్‌వాడీ కోడిగుడ్లు లభ్యమయ్యాయి. దీంతో విచారణ చేయగా క్యాంటీన్‌ను అంగన్‌వాడీ టీచర్ కవితనే నిర్వహిస్తున్నట్లు సీడీపీఓ తెలిపారు. వెంటనే కోడిగుడ్లు సీజ్ చేసి ఆమె పని చేస్తున్న భూక్య తండా అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి తనిఖీ చేయగా గుడ్లు తక్కువగా ఉన్నాయన్నారు. మిగిలిన స్టాక్‌లో కూడా తేడా ఉందని, అన్నింటిని సీజ్ చేశారు. పూర్తి నివేదిక తయారు చేసి జిల్లా సంక్షేమాధికారికి అందజేయనున్నట్లు, అధికారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. కోడి గుడ్లు మందు బాబులకు విక్రయించడం చాలా దారుణమన్నారు. అవినీతికి పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. వైన్స్‌షాపు నిర్వాహకులను అడగగా ఆమె పర్మినెంట్ రూం క్యాంటీన్‌ను లీజ్‌కు తీసుకుందని చెప్పారన్నారు.

వేధింపులపై కేసు నమోదు

నెల్లికుదురు: ఓ యువతిని వేధింపులకు గురిచేసిన ఘటనలో ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిర్ర రమేశ్ బాబు తెలిపారు. మంగళవారం ఎస్సై మాట్లాడుతూ.. మండలంలోని రామన్నగూడెం గ్రామానికి చెందిన ఓ యువతి వరంగల్‌లో డిగ్రీ చదువుకుంటున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లో ఉంటున్న యువతిని అదే గ్రామానికి చెందిన మేర్గు సాయికుమార్ ప్రేమించాలంటూ వెంటపడుతూ వేధిస్తుండడంతో గత నెల 29న యాసిడ్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా గమనించిన బంధువులు ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. యువతి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య

గూడూరు: అనారోగ్యంతో ఒకరు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని దామరవంచ శివారు లక్ష్మితండాలో మంగళవారం జరిగింది. వివరాల ప్రకారం నూనావత్ రమేష్‌నాయక్ (35) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఇటీవల అనారోగ్య పరిస్థితిని తట్టులేక ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అంబులెన్స్‌లో గూడూరు సీహెచ్‌సీ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు వరంగల్ ఎంజీఎంకు రెఫర్ చేయగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడికి భార్య సునీత, కూతురు, కుమారుడు ఉన్నారు.

బోడతండాలో కలప పట్టివేత..!

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధి శనిగపురం గ్రామ శివారు బోడతండాలో సోమవారం అర్ధరాత్రి అటవీ శాఖ అధికారులు ఓ ట్రాక్టరు కలప పట్టుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. బోడతండాలోని ఒకరి ఇంట్లో కలప నిల్వ ఉంచినట్లు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందగా వారు ఘటన స్థలానికి వెళ్లిన సమయంలో స్థానికులు అర్ధరాత్రి అధికారులు వచ్చి తమను ఇబ్బందులకు గురిచేయటం ఏమిటని ప్రశ్నించినట్లు తెలిసింది. అటవీ అధికారులు ట్రాక్టరు కలపను అదుపులోకి తీసుకుని మహబూబాబాద్ అటవీ రేంజ్ అధికారి కార్యాలయానికి తరలించినట్లు తెలుస్తుంది. కలప పట్టివేత విషయమై అటవీ శాఖ సెక్షన్ ఆఫీసర్ గౌసుద్దీన్ ను వివరణ కోరేందుకు ఫోన్ కాల్ చేసి ప్రయత్నించగా ఆయన సమాధానం ఇవ్వలేదు.

సంక్షిప్త సమాచారం

నేడు వీరన్న జాతరపై సమీక్ష

కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత శ్రీవీరభద్రస్వామి కల్యాణ మహోత్సవ జాతర మహాశివరాత్రి నుంచి జరుగుతుందని, జాతరపై సమీక్షా సమావేశం ఈనెల 5వ తేదీన మహబూబాబాద్ ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్డీఓ అధ్యక్షతన వివిధ శాఖల అధికారులు, దేవాలయ ధర్మకర్తల మండలి సభ్యులతో ఉదయం 10.30గంటలకు హాజరుకావాలని తెలిపారు.

విలీనసభను జయప్రదం చేయండి

బయ్యారం: సూర్యాపేట జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించనున్న రెండు అరుణోదయ సాంస్కృతిక సమాఖ్యల విలీనసభను జయప్రదం చేయాలని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి చారీ హరీశ్ పిలుపునిచ్చారు. మంగళవారం బయ్యారంలో దొరన్న విజ్ఞాన కేంద్రంలో విలీనసభ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు రాజు, నాగేశ్వరరావు, వీరభద్రం, సురేష్, తేజ పాల్గొన్నారు.

పశు వైద్యశిబిరం

కురవి: మండలంలోని మొగిలిచర్ల గ్రామం మంగళవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో పశు వైద్య అధికారులు డాక్టర్ రాజేందర్, డాక్టర్ నాళ్లం అశోక్, వీఏ సంధ్య, గోపాల మిత్ర సూపర్‌వైజర్ కరిమిళ్ల రఘువీర్, గోపాలమిత్రులు పాల్గొన్నారు.

టీషర్టుల అందజేత

గార్ల: మండలంలోని సీతంపేటలో జరుగుతున్న జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు యూనిఫాం జెర్సీలు (టీషర్టులు) పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్ అభిమానులు బాబూలాల్, ఎస్‌కె యాకూబ్‌పాషా అందజేశారు. కార్యక్రమంలో నాయకుడు గుండా వెంకట్ రెడ్డి, నిర్వహకులు భాస్కర్, సర్వేష్, రాజశేఖర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

అన్నదానం గొప్పది

తొర్రూరు: అన్నిదానాల్లో కెల్లా అన్నదానం గొప్పదని డీఐఈఓ మదార్ అన్నారు. మంగళవారం డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో దాతల సహకారంతో కొనసాగుతున్న మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి నారాయణ, అధ్యాపకులు సువర్ణ, నర్సయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

మరిపెడ: హైదరాబాద్‌లో ఈనెల 16న ఓంకార్ భవనం బాగులింగంపల్లిలో జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని సీపీఎంఎల్ న్యూడెమోక్రసీ తొర్రూరు సబ్‌డివిజన్ కార్యదర్శి అలకుంట్ల సాయన్న పిలుపునిచ్చారు. మంగళవారం మరిపెడలో పోస్టర్‌లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు భిక్షపతి, మంగ్య, వెంకన్న, సుందర్, వెంకట్రాములు, లక్ష్మణ్, శ్రీను దస్రు, తదితరులు పాల్గొన్నారు.

క్షీరాభిషేకం

మహబూబాబాద్ రూరల్: బీసీల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రభుత్వమే టీపీసీసీ ఓబీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల వీరన్నయాదవ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ కులగణన పూర్తి చేసిన సందర్భంగా జిల్లా కేంద్రంలో సీఎం ఫ్లెక్సీకి మంగళవారం క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు రాందాసు, చాంద్ పాషా, రావిశెట్టి శేఖర్, రాజమ్మ పాల్గొన్నారు.

విచారణ చేపట్టాలి

మరిపెడ: మండలంలోని నీలికుర్తి గ్రామ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌పై వెంటనే విచారణ చేపట్టాలని సీపీఐ మండల కార్యదర్శి మారగాని బాలకృష్ణ డిమాండ్ చేశాడు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. నీలికుర్తిలో జరిగిన 14వ సామాజిక తనిఖీలో రూ.8లక్షల అవినీతికి పాల్పడ్డాడన్నారు. నాయకులు బానాల రాజన్న, అలకుంట్ల సాయిలు, అబ్దుల్ రషీద్ తదితరులున్నారు.

సమయపాలన పాటించాలి

తొర్రూరు రూరల్: ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని ఎంఈఓ మాహంకాళి బుచ్చయ్య అన్నారు. మంగళవారం మండలంలోని జమాస్తాన్ పూరం, ఖానాపురం ప్రాథమిక పాఠశాలలను ఎంఈఓ తనిఖీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎంలు కుమారస్వామి, రఘు, మరియు, ఉపాధ్యాయులు, సీఆర్పీ రమేష్ పాల్గొన్నారు.

జింకులోపం లేకుండా చూడాలి

దంతాలపల్లి: యాసంగి పొలాల్లో జింకు లోపం లేకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ విస్తరణ అధికారి ఉదయ్ కిరణ్ అన్నారు. మండలంలోని తూర్పుతండాలో రైతులతో కలిసి పంట పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

గూడూరు: హైదరాబాద్‌లో ఈనెల 7న నిర్వహించనున్న లక్ష గొంతుకలు.. వేల డప్పులు కార్యక్రమ వాల్‌పోస్టర్లను మంగళవారం మండలంలోని సీతానగరం, జగన్నాయకులగూడెం గ్రామాలలో ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ మందుల ప్రవీణ్ మాదిగ ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు సాంబయ్య, యాకయ్య, శివ పాల్గొన్నారు.

ముందస్తు అరెస్ట్

కురవి: సీరోలు, కురవి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మాజీ సర్పంచ్‌లను పోలీస్‌స్టేషన్‌లకు తరలించారు. మంగళవారం మాజీ సర్పంచ్‌లకు ప్రభుత్వం చెల్లించాల్సిన పెండింగ్ బిల్లుల విషయంలో చలో అసెంబ్లీ కార్యక్రమానికి వెళ్తారని భావించిన పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం సొంత పూచికత్తుపై వారిని విడిచిపెట్టారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

గార్ల: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గార్లబయ్యారం సీఐ బి రవికుమార్, ఎస్సై ఎస్‌కె రియాజ్‌పాషాలు ప్రజలకు సూచించారు. మంగళవారం మండలం లోని పూమ్యాతండాలో పోలీస్ జాగృతి కళాబృందం ఆధ్వర్యంలో కళాజాతా నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ నూరుద్దీన్, కానిస్టేబుళ్లు సతీష్‌కుమార్, తిరుపతి, పృథ్వీరాజ్, సుమన్ పాల్గొన్నారు.

నివాళి

డోర్నకల్: ఇటీవల విధి నిర్వహణలో అకాల మరణం పొందిన పోలోజు సోమేశ్వర్ సంతాప సభను స్థానిక అశోక్‌భవన్‌లో మంగళవారం విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ రాజేష్, వీరన్న, అశోక్‌కుమార్, దామోదరాచారి, మహేష్ పాల్గొన్నారు.

ఆరోగ్యానికి సూర్యకిరణాలు దోహదం



యోగా చేస్తున్న విద్యార్థులు

గార్ల: సంపూర్ణ ఆరోగ్యానికి సూర్యకిరణాలు ఎంతో దోహదపడతాయని తిరుమల తిరుపతి దేవస్థానం జిల్లా ప్రచార మండలి సభ్యుడు ఎం.రాములు విద్యార్థులకు సూచించారు. రథ సప్తమిని పురస్కరించుకొని జిల్లా ధార్మిక ప్రచార మండలి ప్రోగ్రాం అధికారి కృష్ణమూర్తి ఆదేశాల మేరకు మంగళవారం స్థానిక విశ్వశాంతి విద్యాలయంలో ఆయన విద్యార్థులకు సూర్య నమస్కారాలు, యోగాపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ వడ్లమూడి దుర్గాప్రసాద్, హెచ్ఎం సంజీవరెడ్డి, ప్రిన్సిపాల్ రమేష్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, నజీర్, విద్యార్థులు పాల్గొన్నారు.